# పైప్‌లైన్‌లో పారేదేంది?

మొదటిపేజీ తరువాయి...

ఎంచుకుంటారు!? ఎత్తులో ఉన్న కొండపోచమ్మ సాగర్ నుంచి తరలిస్తే గ్రావిటీ (భూమ్యాకర్షణ శక్తి) మీదనే వస్తున్నందున దాన్నే ఎంచుకోవాలని చిన్న పిల్లాడు కూడా చెబుతాడు. గ్రావిటీ అంటే తమ పేటెంట్‌గా భావించే కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున కచ్చితంగా కొండపోచమ్మ సాగర్‌కే మొగ్గుచూపాలి. కానీ హైదరాబాద్ మహానగరానికి రెండోదశ గోదావరిజలాల తరలింపులో కాంగ్రెస్ సర్కారు రూటు మార్చింది. 'గ్రావిటీ వద్దు.. పంపింగే ముద్దు' అంటున్నది. కేసీఆర్ హయాంలో గ్రావిటీ ద్వారా గోదావరి జలాల తరలింపుతో మంచినీటి పథకాన్ని డిజైన్ చేస్తే.. తూచ్! అన్న రేవంత్ సర్కారు గ్రావిటీ వదిలి ఏకంగా దాదాపు 108 మీటర్ల ఎత్తిపోతలకు నడుంబిగించింది. అంతే కాదు..23కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండపోచమ్మసాగర్‌ను వదిలి 50 కిలోమీటర్ల దూరంలోని మల్లన్నసాగర్‌ను ఎంచుకున్నది. ఓవైపు ఎత్తిపోతల నిర్మాణ భారం, మరోవైపు 27 కిలోమీటర్ల అదనపు పైప్‌లైన్ నిర్మాణ వ్యయం, వీటిన్నింటికీ మించి ఇప్పటికే కృష్ణా, గోదావరిజలాల మంచినీటి పథకాల కరెంటు బిల్లులకు ఏటా రూ.500 కోట్లు చెల్లిస్తున్న జలమండలిపై సంవత్సరానికి మరిన్ని వందల కోట్ల అదనపు భారం పడనున్నది.

ఇంతకీ.. ఇన్ని అదనపు వ్యయాలు, భారాలతో రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ మహానగరానికి రెండో దశ గోదావరిజలాల తరలింపు పథకానికి రూ.5,560 కోట్లతో పాలనా అనుమతి ఎందుకు ఇచ్చిందంటారు!? ఆ ఒక్కటీ అడగొద్దు సుమా..!

హైదరాబాద్ మహానగరానికి భవిష్యత్తులోనూ మంచినీటి సమస్య తలెత్తకుండా ఉండటంతో పాటు మూసీ ప్రక్షాళన కోసం కాళేశ్వరం పథకం నుంచి గోదావరి జలాలను తరలించాలని గత కేసీఆర్ ప్రభుత్వమే నిర్ణయించింది. ఈ మేరకు కాళేశ్వరం పథకం రూపకల్పనలోనే అన్నిరకాల వెసులుబాట్లు కల్పించింది. హైదరాబాద్ తాగునీటి కోసం ఏటా 30 టీఎంసీల కేటాయింపును కాళేశ్వరం డీపీఆర్‌లోనే పొందుపరిచింది. ఎల్లంపల్లి జలాశయం నుంచి నగరానికి మొదటి దశలో గోదావరి జలాల తరలింపు కొనసాగుతున్నది. ఈ పథకం కింద ఏటా 10 టీఎంసీల జలాలు వాడుకుంటున్నారు. రెండోదశలో కూడా మరో పది టీఎంసీల గోదావరి జలాలు తరలించి హైదరాబాద్ మహానగరవాసులకు అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం డీపీఆర్‌ను కూడా తయారు చేసింది. కాళేశ్వరం పథకంలో 15 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న కొండపోచమ్మ సాగర్ నుంచి గ్రావిటీ పైనే ఈ జలాలను మేడ్చల్ జిల్లా శామీర్‌పేట సమీపంలోని ఘన్‌పూర్ వద్దకు తరలింపుతో పాటు శుద్ధి చేసిన నీటిని ప్రజలకు అందించే సాంకేతిక అంశాలన్నీ అందులో ఉన్నాయి. ఇదేగాకుండా కొండపోచమ్మసాగర్ నుంచి సాగునీటి కోసం నిర్మించిన 127 కిలోమీటర్ల సంగారెడ్డి కాల్వ డిజైన్‌లోనే మూసీ ప్రక్షాళన కోసం ముందుచూపుతో నీటి కేటాయింపు చేపట్టారు. వాస్తవంగా సంగారెడ్డి కాల్వ గరిష్ఠ వరద ప్రవాహ సామర్థ్యం 5054 క్యూసెక్కులు ఉండగా ఇందులో సాగునీటికి 4,354 క్యూసెక్కులు, మూసీ ప్రక్షాళన కోసం 700 క్యూసెక్కులను జంట జలాశయాలకు తరలించేందుకు డిజైన్ చేశారు.



సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్‌లోని అన్నపూర్ణ పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ నుంచి బయటికి దుంకుతున్న గోదావరి జలాలు

## లింక్-2లో గోదావరి పరవళ్లు.. రంగనాయకసాగర్ వైపు పరుగులు

సిద్దిపేట, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ధర్మారం/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట: గోదావరి జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. పదిరోజులుగా ఎల్లంపల్లి నుంచి మధ్యమానేరుకు పరిగెడుతున్న జలాలు, మంగళవారం నుంచి సిద్దిపేట జిల్లాలోని రంగనాయనాయక సాగర్ జలాశయం వైపు సాగాయి. దిగువన కాళేశ్వరం ప్రాజెక్ట్ లింక్-2లోని నంది, గాయత్రీ పంప్‌హౌస్‌లలో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. మధ్యమానేరు నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా తిప్పాపూర్‌లోని సర్జ్‌పూల్‌కు జలాలు చేరుతుండగా, ఇక్కడి పంప్‌హౌస్‌లో రెండు బాహుబలి మోటర్ల ద్వారా 6,440 క్యూసెక్కులు అన్నపూర్ణ జలాశయానికి తరలిస్తున్నారు. ఇక్కడ గేట్లు తెరిచి అంతే మొత్తంలో రంగనాయకసాగర్‌కు వదులుతున్నారు. రంగనాయక్‌సాగర్‌కు నీళ్లు రావడంతో సిద్దిపేట రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నీటి కోసం లేఖ రాసిన మాజీ మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. రంగనాయకసాగర్ నుంచి మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లను నింపనున్నట్టు అధికారులు తెలిపారు.

### పథకం స్వరూపాన్ని మార్చిన రేవంత్ సర్కారు

కేవలం గ్రావిటీ మీద నగరానికి రెండోదశ గోదావరి జలాల తరలింపు పథకాన్ని రేవంత్ ప్రభుత్వం పక్కన పెట్టింది. ఇంతకంటే మెరుగైన డిజైన్, తక్కువ వ్యయంతో పథకం రూపకల్పన చేస్తే బాగుండేది. కానీ గ్రావిటీని కాదని ఎత్తిపోతలను ఎంచుకోవడమే కాకుండా పైప్‌లైన్ దూరం పెంచి, జలమండలిపై అదనంగా కరెంటు ఖర్చును కూడా మోపేలా కొత్త డిజైన్ రూపొందించింది. ఈ మేరకు మంగళవారం రూ.5,560 కోట్లతో రెండోదశ గోదావరిజలాల తరలింపు పథకానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. కేసీఆర్ హయాంలోని డిజైన్‌తో తాజా డిజైన్‌ను బేరీజు వేస్తే పథకం నిర్మాణ వ్యయంతో పాటు నిర్వహణ వ్యయం కూడా కోట్లాది రూపాయల మేర పెరిగిందని స్పష్టమవుతున్నది.

**1. కేసీఆర్ ప్రభుత్వ డిజైన్ ప్రకారం:** కొండపోచమ్మ సాగర్ నుంచి మేడ్చల్ జిల్లా శామీర్‌పేట సమీపంలోని ఘన్‌పూర్ వరకు గోదావరి జలాలను గ్రావిటీ ద్వారా తరలించవచ్చు. ఎత్తిపోతల భారం ఉండదు. పంపుహౌస్, మోటర్లు అవసరం లేదు.

**రేవంత్ ప్రభుత్వ డిజైన్ ప్రకారం :** మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్‌కు గోదావరి జలాలను ఏకంగా 108 మీటర్లు ఎత్తిపోయాలి. ఇందుకుగాను భారీ మోటర్లు అవసరం. పంపుహౌస్ నిర్మించాలి. ఇందుకు వందల కోట్లు ఖర్చు చేయాలి. ఏటా నిర్వహణ వ్యయం కూడా కోట్లల్లో ఉంటుంది.

**2. కేసీఆర్ ప్రభుత్వ డిజైన్ ప్రకారం:** కొండపోచమ్మ సాగర్ నుంచి ఘన్‌పూర్ వరకు 23 మీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణం సరిపోతుంది.

**రేవంత్ ప్రభుత్వ డిజైన్ ప్రకారం:** మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్ వరకు 50 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మించాలి. అంటే 27 కిలోమీటర్ల దూరం పైప్‌లైన్ నిర్మాణం పెరిగింది. ప్రస్తుత ఎస్ఎస్ఆర్ ప్రకారం కిలోమీటర్ పైప్‌లైన్ నిర్మాణానికి సుమారు రూ.20 కోట్ల ఖర్చవుతుందని అధికారులు తెలిపారు. ఈ చొప్పున అదనంగా 27 కిలోమీటర్లకు రూ.540 కోట్ల భారం పెరిగింది. పైప్‌లైన్ నిర్వహణ భారం కూడా ఏటా జలమండలిపై పడుతుంది.

**3. కేసీఆర్ ప్రభుత్వ డిజైన్ ప్రకారం :** కొండపోచమ్మ సాగర్ నుంచి గ్రావిటీ ద్వారా జలాల తరలింపు ఉంటున్నందున ఎత్తిపోతలకు కరెంటు ఖర్చు ఉండదు.

**రేవంత్ ప్రభుత్వ డిజైన్ ప్రకారం :** మల్లన్నసాగర్ వద్ద సుమారు 108 మీటర్ల మేర నీటిని ఎత్తిపోయాలి. అంటే కరెంటు బిల్లు తడిసి మోపెడవుతుంది. ఇప్పటికే జలమండలి కృష్ణా మూడు దశలు, గోదావరి మొదటి దశ జలాల తరలింపునకు ఏటా సుమారు రూ.500 కోట్ల కరెంటు బిల్లులు చెల్లిస్తున్నది. ప్రస్తుతం రూ.4,500 కోట్ల కరెంటు బిల్లుల బకాయి కూడా జలమండలి నెత్తిన ఉన్నది. రెండో దశ గోదావరిజలాల తరలింపునకు మరిన్ని వందల కోట్లు కరెంటు ఖర్చు రూపంలో శాశ్వతంగా జలమండలిపై భారంగా ఉంటుంది.

### ఇద్దరిదీ డొల్ల వాదనే..

కొండపోచమ్మ కాకుండా మల్లన్నసాగర్‌ను ఎంచుకోవడంలో అటు నీటిపారుదల శాఖ, ఇటు జలమండలి అధికారులు తలో వాదన వినిపిస్తున్నారు. ఇద్దరి వాదనల్లోనూ డొల్లతనమే ఉండటం గమనార్హం.

**నీటిపారుదల శాఖ అధికారుల వాదన:** కొండపోచమ్మ సాగర్‌కు కాళేశ్వర జలాలు రావాలంటే మల్లన్నసాగర్ తర్వాత రెండు దశల్లో జలాలు ఎత్తిపోయాలి. గోదావరి మంచినీటి పథకంలో మల్లన్నసాగర్‌ను ఎంచుకోవడం వల్ల ఆ రెండు దశల ఎత్తిపోతల భారం తగ్గింది.

వాస్తవానికి హైదరాబాద్ మంచినీటి కోసమే మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్‌కు గోదావరి జలాలను తరలించడం లేదు. బృహత్తర కాళేశ్వరం పథకంలో భాగంగా సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, యాదాద్రి, మేడ్చల్ జిల్లా పరిధిలోని లక్షలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది. అందులో భాగంగానే కొండపోచమ్మ సాగర్‌లో నీటిని నింపుతారు. హైదరాబాద్ మంచినీటి పథకం కోసమే నింపడం అనేది జరగదు. పైగా ఇప్పుడు మంచినీటి పథకాన్ని మల్లన్నసాగర్‌కు మార్చినందున కొండపోచమ్మసాగర్‌ను నింపకుండా ఉండరు కదా!

**జలమండలి అధికారుల వాదన:** కొండపోచమ్మసాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 15 టీఎంసీలు. అదే మల్లన్నసాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 50 టీఎంసీలు. అక్కడ నీటి లభ్యత ఎక్కువగా ఉంటుంది.

ఎన్ని టీఎంసీలున్నా గోదావరి మంచినీటి పథకంలో భాగంగా సుమారు 500-600 క్యూసెక్కుల కంటే ఎక్కువ తీసుకోరు. నీటి నిల్వ సామర్థ్యమే ప్రామాణికం అనుకుంటే. ప్రస్తుతం నగరానికి మూడు దశల కృష్ణాజలాల తరలింపు కింద రోజుకు 270 ఎంజీడీల నీళ్లు వస్తున్నాయి. ఇందుకోసం ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ముడినీటిని సేకరిస్తున్నారు. ఈ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కేవలం 1.5 టీఎంసీలు. అంటే అక్కంపల్లి కంటే కొండపోచమ్మ సాగర్ పదిరెట్లు ఎక్కువ సామర్థ్యంతో ఉన్నది. అలాంటప్పుడు నీటి నిల్వ సామర్థ్యం అనేది అసలు ప్రామాణికమే కాదు.

### ఈ రూపంలోనూ మరో భారం..

**వాస్తవానికి** మంచినీటి పథకాల్లో వాటర్ సోర్స్ (నీటిని సేకరించే వనరు) సమీపంలోనే మంచినీటి శుద్ధికేంద్రం (డబ్ల్యూటీపీ) నిర్మించాలని నిపుణులు తెలిపారు. దీని ద్వారా అక్కడే నీటిని శుద్ధి చేయడం వల్ల సరఫరా భారం తగ్గుతుంది. వంద లీటర్ల మంచినీటి కోసం అంతకంటే కనీసంగా 20 శాతం ఎక్కువ ముడినీటిని అంటే సుమారు 120 లీటర్లు తీసుకోవాలి. అందులో టర్బిడిటీ, ఇతరత్రా అన్నింటినీ తొలగించడం ద్వారా శుద్ధినీరు వస్తుంది. అందుకే నీటి వనరు సమీపంలోనే ఈ కేంద్రాలు నిర్మించడం వల్ల 20 శాతం మేర సరఫరా భారం తగ్గుతుంది. అంతేకాకుండా మార్గమధ్యలో ఉన్న గ్రామాలకు సైతం శుద్ధినీరు అందించే అవకాశం ఉంటుంది. కానీ తాజా మంచినీటి పథకంలో 50 కిలోమీటర్ల దూరం ముడినీటిని తరలించిన తర్వాత ఘన్‌పూర్ వద్ద శుద్ధి చేస్తున్నారు. కేసీఆర్ హయాంలోనూ ఇదేరీతిన డిజైన్ ఉందనుకున్నా గత డిజైన్‌లో దూరం 23 కిలోమీటర్లు మాత్రమే. కానీ ఇప్పుడు రెట్టింపునకు పైగా పెరిగింది. తద్వారా ఈ రూపంలోనూ భారం పెరగనుంది.

## లోకం పోకడ





రుణాలు మాఫీ కావడం లేదని ప్రభుత్వాన్ని ఎందుకు బద్నాం చేస్తారయ్యా? ఆయన పేరు మీద నేను తీసుకున్న రుణం మాఫీ అయ్యింది గదా!

## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 36.8°c | 23.5°c |
| నల్లగొండ | 35.9°c | 22.0°c |
| రంగారెడ్డి | 35.8°c | 22.2°c |
| మెదక్ | 34.4°c | 22.6°c |
| నిజామాబాద్ | 32.4°c | 24.5°c |
| మహబూబ్‌నగర్ | 30.0°c | 22.2°c |
| హైదరాబాద్ | 29.6°c | 24.5°c |
| వరంగల్ | 28.0°c | 24.0°c |
| కరీంనగర్ | 28.0°c | 25.0°c |
| ఖమ్మం | 26.0°c | 24.0°c |

# 5560 కోట్లతో పైప్‌లైన్!

మొదటిపేజీ తరువాయి...

రుణాన్ని తీసుకోనున్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా బడ్జెట్‌లో నిధులు కేటాయించనుంది. ప్రాజెక్టు ద్వారా నగరానికి అదనంగా గోదావరి జలాలు తరలించడంతో పాటు హియాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాలకు పునరుజ్జీవం తేనున్నారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 30 టీఎంసీలు కేటాయించి నగరానికి తాగునీటి భరోసా కల్పించారు. ఇందులో భాగంగానే గోదావరి రెండో దశ పనులు చేపట్టేందుకు సర్కారు నిర్ణయించింది.

### ప్రాజెక్టు విశేషాలు

- మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్ వరకు 15 టీఎంసీల నీటి తరలింపునకు 3600 ఎంఎం డయా భారీ పైపులైన్ నిర్మాణం.
- ఘన్‌పూర్ నుంచి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌కు ఐదు టీఎంసీల నీటి తరలింపు.
- ఘన్‌పూర్ వద్ద 780 ఎంఎల్‌డీ సామర్థ్యంతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు.
- ఉస్మాన్‌సాగర్ (గండిపేట) వద్ద 120 ఎంఎల్‌డీ, హిమాయత్‌సాగర్‌లోని రాజేంద్రనగర్ వద్ద 70 ఎంఎల్‌డీ సామర్థ్యంతో డబ్ల్యూటీపీ ప్లాంట్ నిర్మాణం
- ఘన్‌పూర్ డబ్ల్యూటీపీ నుంచి ముత్తంగి జంక్షన్ వరకు 3000 ఎంఎం డయారింగ్ మెయిన్ ద్వారా నీటిని తరలించి వెస్ట్రన్ పార్ట్‌లో ఓఆర్ఆర్ పరిధిలో నీటి తరలింపు.

### 2030 అవసరాలకు తగ్గట్టు..

జలమండలి రోజూ హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాలకు కృష్ణా మూడు దశలు, గోదావరి తొలి విడత, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, సింగూరు, మంజీరాల నుంచి 580 ఎంజీడీల నుంచి 600 ఎంజీడీల నీరు సరఫరా చేస్తున్నది. దాదాపు 13 లక్షల నల్లా కనెక్షన్లకు తాగునీటిని అందిస్తున్నది. హైదరాబాద్ విస్తరిస్తుండటం, ఓఆర్ఆర్ వరకు జలమండలి పరిధి విస్తరించడంతో 2030 వరకు నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని 170 ఎంజీడీల అదనపు జలాల సరఫరాను ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. గోదావరి నుంచి మొత్తం 30 టీఎంసీలు వాడుకునే వెసులుబాటు ఉండగా గోదావరి ఫేజ్-2 ద్వారా అదనపు జలాలు వాడుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. 2030 వరకు హైదరాబాద్ తాగునీటి డిమాండ్ 750 ఎంజీడీల వరకు పెరగనున్నదని అధికారులు అంచనావేస్తున్నారు. 2050 నాటికి 1014 ఎంజీడీలుగా ఉండనున్నది. ఈ డిమాండ్ మేరకే ప్రాజెక్టు పట్టాలెక్కిందని అధికారులు చెబుతున్నారు.

### రెండేండ్లలో ప్రాజెక్టు నిర్మాణం

గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లయ్ ఫేజ్-1 కింద నగర ప్రజల నీటి అవసరాల కోసం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి జలమండలి ఇప్పటికే 10 టీఎంసీల నీరు తరలిస్తున్నది. రెండో దశ ద్వారా మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి మరో 15 టీఎంసీల నీటిని వాడుకునే అవకాశం ఉన్నది. 15 టీఎంసీల్లో 10 టీఎంసీలు నగర ప్రజల తాగునీటి అవసరాలకు పోను మూసీ ప్రక్షాళనలో భాగంగా జంట జలాశయాల పునరుజ్జీవనానికి మరో 5 టీఎంసీలు ఉపయోగించనున్నారు. డీపీఆర్ (డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్)ను వ్యాప్కోస్ కంపెనీ సిద్ధంచేసింది. పంప్‌హౌస్‌లు, సబ్‌స్టేషన్లు, మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్ వరకు 3600 ఎంఎం డయా పైపులైన్ నిర్మించనున్నారు. ఘన్‌పూర్, శామీర్‌పేట్ వద్ద 780 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటిశుద్ధి కేంద్రాన్ని (డబ్ల్యూటీపీ) నిర్మించనున్నారు. ఘన్‌పూర్ నుంచి ముత్తంగి వరకు పంపింగ్ మెయిన్ నిర్మాణం, ఇతర పనులు చేపట్టనున్నారు. రెండేండ్లలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

### వరద కాల్వకు గండి



నల్లగొండ జిల్లా అనుముల మండలంలోని మారేపల్లి-పులిమామిడి గ్రామాల మధ్య మంగళవారం ఉదయం వరద కాల్వకు గండి పడింది. 40 మీటర్ల మేర కట్ట కోత పడడంతో నీళ్లన్నీ హాలియా వాగులోకి వృథాగా పారాయి. దీంతో అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. ఐదు రోజుల్లో గండిని పూడ్చివేస్తామని ఇరిగేషన్ ఏఈ ఆంజనేయులు తెలిపారు. - హాలియా



నాగార్జునసాగర్ ప్రాజెక్టు 22 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు పరుగులు తీస్తున్న జలాలు

# 22 గేట్లెత్తి సాగర్ నీటి విడుదల

- **నిండుకుండల్లా శ్రీశైలం, జూరాల**

నందికొండ/చింతలపాలెం/గద్వాల/అయిజ/శ్రీశైలం, ఆగస్టు 6: నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వరద పోటెత్తండంతో 22 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతున్నది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు సోమవారం రాత్రికి 585 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో పెరగడంతో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు 22 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 3,08,770 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం, జూరాల ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. జూరాలకు 2,52,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా 33 గేట్లు ఎత్తి 2,49,359 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 3,71,093 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 10 క్రస్ట్ గేట్లను 12 అడుగులమేర ఎత్తి 3,72,053 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు.

### పులిచింతలలో విద్యుత్తు ఉత్పత్తి ప్రారంభం

నాగార్జునసాగర్ నుంచి వరద పోటెత్తుతుండటంతో పులిచింతలలోని తెలంగాణ జెన్‌కో విద్యుత్తు కేంద్రంలో విద్యుత్తు ఉత్పత్తిని మంగళవారం ప్రారంభించారు. జెన్‌కోలో 4 యూనిట్లలో విద్యుత్తు ఉత్పాదనకు అవకాశం ఉండగా ప్రస్తుతం 10 వేల క్యూసెక్కుల నీటితో మూడు యూనిట్లను నడిపిస్తూ 60 మెగావాట్లను ఉత్పత్తి చేస్తున్నట్టు ఎస్ఈ దేశ్యానాయక్ తెలిపారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై జులుం

- తుమ్మిళ్ల లిఫ్ట్ వద్ద అధికార పార్టీ దౌర్జన్యం
- మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ వైఖరి వివాదాస్పదం
- మోటర్లను ఆన్ చేసిన ఎమ్మెల్యే విజయుడు
- బంద్ చేయించిన సంపత్‌కుమార్
- రైతులకు నీళ్లివ్వాలని పోలీసుల కాళ్లు పట్టుకున్న ఎమ్మెల్యే
- ఎమ్మెల్యే విజయుడి అరెస్టుపై నిరసనలు

రాజోళి, ఆగస్టు 6: జోగుళాంబ గద్వాల జిల్లా తుమ్మిళ్ల లిఫ్ట్ వద్ద అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడిపై అధికార కాంగ్రెస్ పార్టీ జులుం ప్రదర్శించింది. కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ప్రొటోకాల్ పద్ధతినే అపహాస్యం చేశారు. కాంగ్రెస్ పార్టీ నేతలకు తలొగ్గిన అధికారులు ఎమ్మెల్యేనే అరెస్ట్ చేయించారు. తీవ్ర ఉద్రిక్తతకు దారితీసిన ఈ ఘటన మంగళవారం జరిగింది. పెద్ద ఎత్తున వరద రావడంతో ప్రొటోకాల్ ప్రకారం ఇరిగేషన్ అధికారుల పిలుపుమేరకు ఎమ్మెల్యే విజయుడు ఎత్తిపోతల మోటర్లను ఉ.7:15 గంటలకు రన్ చేశారు.విషయం తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే సంపత్ అనుచరులతో ప్రాజెక్టు వద్దకు చేరుకొని మోటర్లను బంద్ చేయించారు. అక్కడున్న సిబ్బందిపై అధికార పార్టీ నాయకులు చేయిచేసుకున్నట్టు స్థానికులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సంపత్ వైఖరిపై ఎమ్మెల్యే విజయుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. మోటర్లు ప్రారంభించి రైతులను ఆదుకోవాలని కలెక్టర్‌ను, ఇరిగేషన్ అధికారులను కోరారు. ఎన్నిసార్లు విన్నవించినా ఆన్ చేయకపోవడంతో ఎమ్మెల్యే లిఫ్ట్ వాటర్ డెలివరీ పాయింట్ డీ-22 వద్దకు చేరుకొని రైతులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నిరసనకు దిగారు. మోటర్లు ఆన్ చేసేవరకు నిరసనలు ఆపేది లేదని టెంటు వేసి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రైతులు వంటావార్పు చేపట్టారు. సాగునీరు అందించాలని తాను వస్తే రాజకీయం చేయడం సరికాదని ఎమ్మెల్యే విజయుడు మండిపడ్డారు.నడిగడ్డరైతులకు కేసీఆర్ ఇచ్చిన వరం తుమ్మిళ్ల ప్రాజెక్టు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



రైతులకు నీళ్లివ్వాలని పోలీసుల కాళ్లు పట్టుకుంటున్న ఎమ్మెల్యే విజయుడు

### పోలీసుల కాళ్లు పట్టుకున్న ఎమ్మెల్యే

అడిషనల్ ఎస్పీ గుణశేఖర్, ఇతర పోలీస్ అధికారులు అక్కడకు చేరుకొని ఇరువర్గాలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. మోటర్లను ఈ రోజు ప్రారంభించం, అందరూ వెళ్లిపోవాలని కోరారు. మోటర్లు ఆన్ చేసేవరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని ఎమ్మెల్యే తేల్చిచెప్పారు. రైతులకు సాగునీరు అందించాలని, అదే తన లక్ష్యమని వేడుకుంటూ అడిషనల్ ఎస్పీ గుణశేఖర్ కాళ్లు పట్టుకొని ఎమ్మెల్యే విజయుడు విన్నవించారు. అయినా వినని పోలీసులు ఎమ్మెల్యేతో పాటు రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలను అరెస్టు చేసి శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో రైతులు, కార్యకర్తలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

అనంతరం మాజీ ఎమ్మెల్యే సంపత్ అక్కడికి చేరుకొని పంపులను ఆన్ చేయాలని అనుచరులు, రైతులతో కలిసి బైఠాయించారు. ఆర్డీఎస్ ఉన్నతాధికారులు, కలెక్టర్‌కు ఫోన్ చేశారు. అధికారులు మోటర్లను ఆన్ చేయడంతో పూజలు నిర్వహించారు. అనంతరం సంపత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని అయిజ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### ఇదేనా ప్రజాపాలన: కేటీఆర్

అలంపూర్ ఎమ్మెల్యే విజయుడి పట్ల ప్రభుత్వ అధికారులు వ్యవహరించిన తీరుపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలనలో ప్రతినిధులకు రోజూ అవమానాలేనా? అని నిప్పులు చెరిగారు. ఎమ్మెల్యే విజయుడు పట్ల గద్వాల జిల్లా అధికార యంత్రాంగం వ్యవహరించిన అనుచిత తీరుపై మండిపడ్డారు. ప్రజల చేతిలో తిరస్కరించబడిన కాంగ్రెస్ నేతలను అధికారిక సమావేశాలకు, కార్యక్రమాలకు ఎందుకు ఆహ్వానిస్తున్నారో చెప్పాలని, రాష్ట్రంలో ప్రజాప్రతినిధులను అవమానించేందుకు ప్రభుత్వం ప్రొటోకాల్ విధానాలను మార్చిందా.. అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ప్రశ్నించారు.



జనగామ జిల్లాలోని చీటకోడూరు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

# రెండు నెలలైనా సాగు నీరివ్వరా?

- చీటకోడూరు రిజర్వాయర్ ఎండుతున్నది
- 4 రోజులైతే జనగామకు మంచినీరు బంద్
- దేవాదుల అధికారులపై ఎమ్మెల్యే పల్లా ఫైర్

జనగామ, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): 'చిన్నచిన్న కారణాలు చెప్పి రైతులకు సాగునీరు, జనగామ పట్టణ ప్రజలకు తాగునీళ్లు ఇవ్వకుండా చీటకోడూరు రిజర్వాయర్‌ను ఎండబెడుతరా? మొన్నటి దాకా మేం (కేసీఆర్ ప్రభుత్వం) నీళ్లు ఇచ్చాం కదా? ఎవరైనా నీళ్లు ఇవ్వద్దని మీకు చెప్పారా?' అంటూ నీటిపారుదల శాఖ సీఈ అశోక్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి ఫోన్‌లో నిలదీశారు. మంగళవారం ఆయన జనగామ జిల్లా అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, కౌన్సిలర్లు, జిల్లా నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి జనగామ జిల్లా జనగామ మండలం చీటకోడూరు రిజర్వాయర్‌ను పరిశీలించారు. పుట్‌బాల్స్ తేలి నీరు అడుగంటడాన్ని చూసి ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే సంబంధిత దేవాదుల, నీటిపారుదల శాఖ ఉమ్మడి జిల్లా అధికారులకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. జనగామ పట్టణ ప్రజలకు తాగునీరు అందించే రిజర్వాయర్ డెడ్ స్టోరేజీకి చేరిందని,మూడు పుట్‌బాల్స్‌లో రెండు పైకి తేలాయని, రెండు, మూడురోజుల్లో నీరు మొత్తం అడుగంటి జనగామ ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే అశ్వరావుపల్లి నుంచి జనగామకు తాగునీటి కోసం నీళ్లు వదలాలని కోరారు. ధర్మసాగర్ నుంచి ఆర్ఎస్ ఘన్‌పూర్‌కు నీటిని వదిలి రెండో పంపు ఆన్ చేస్తే.. అక్కడి నుంచి అశ్వారావుపల్లికి వచ్చి.. అక్కడి నుంచి చీటకోడూరుకు నీళ్లు రావడానికి నాలుగురోజులు పడుతుందని వివరించారు. ధర్మసాగర్ నుంచి గండిరామారానికి కూడా నీటిని విడుదల చేయాలని సూచించారు. తపాస్‌పల్లి, బొమ్మకూర్, గండిరామారం రిజర్వాయర్ల ఆయకట్టు కింద 40 శాతం కూడా నాట్లు పడలేదని, నార్లు ముదిరిపోతున్నాయని, చిన్న చిన్న కారణాలు చెప్పి నీళ్లు వదలకుండా రైతులను గోస పెడుతరా? అంటూ సీఈ అశోక్ కుమార్‌ను ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి నిలదీశారు.



## ఇంటి ఆవరణలోకి మొసలి

పెబ్బేరు, ఆగస్టు 6: వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం జానంపేటలో మంగళవారం ఓ ఇంట్లోకి మొసలి వచ్చింది. గ్రామానికి చెందిన నాగన్న ఇంటి వద్ద మంగళవారం తెల్లవారుజామున కుక్కలు పెద్దగా అరిచాయి. నాగన్న నిద్రలేచి చూడగా బాత్‌రూం పక్కనే మొసలి కనిపించింది. వెంటనే 100కు ఫోన్ చేయగా పోలీసులు, సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణసాగర్ అక్కడకు చేరుకొని మొసలిని బంధించారు. అటవీ శాఖ అధికారి రాణి సమక్షంలో కృష్ణానదిలో మొసలిని వదిలారు. రామసముద్రం చెరువు నుంచి రావొచ్చని గ్రామస్తులు తెలిపారు.